క్లుప్తంగా

నిరుపేదలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

బొమ్మనహాళ్: నిరుపేదలకు 'ఫ్యామిలీ డాక్టర్' వరమని శ్రీధరఘట్ట పీహెచ్ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. మండలంలోని గోనేహాళ్ గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారిణి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి సూచనలు, సలహాలిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, సీహెచ్ఓ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ ,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

బొమ్మనహాళ్: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను గురువారం మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. గ్రామాల్లో యువకులు, పెద్దలందరూ జైశ్రీరాం జైజై శ్రీరాం అని నినాదాలు చేస్తూ అక్షింతలు, అయోధ్య నమూనా చిత్రం, ఆహ్వాన పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే భగవాన్ రామ్ లల్లా విరాజ్‌మాన్ (బల రాముడు) మహాప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఇంట్లో పూజలు చేయాలన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి

ఉరవకొండ: నియోజకవర్గ అసెంబ్లీ ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు గురువారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఐదు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణ, సిబ్బంది హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే రాజకీయ పార్టీ నేతల సలహాలు, సూచనల మేరకు డబుల్ ఎంట్రీ ఓట్లు, ఒకే డోర్‌నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని గుర్తించి తొలగించామన్నారు. తప్పులు లేని ఓటరుజాబితా కోసం అందరూ సహకరించాలన్నారు.

19 నుంచి కులగణన సర్వే



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో 32 వార్డుల్లోనూ ఈ నెల 19 నుంచి కులగణన సర్వేను పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని డ్వామా హాల్‌లో గురువారం సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, వలంటీర్లకు సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వే విధానాలపై క్షుణ్ణంగా వివరించారు. రెండుసార్లు సర్వే వాయిదా పడిన నేపథ్యంలో కులగణన సర్వేపై మరోసారి అవగాహన కోసం శిక్షణ ఇచ్చామన్నారు. సర్వే ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కావాలన్నారు. సర్వేలో ఒక కుటుంబానికి 20 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇంటి వద్దకు వచ్చే సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లకు ప్రజలు సహకరించాలన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, రుషికేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. వైద్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, సేవ్ చైల్డ్, పోషక ఆహారం, సంక్రాంతి పండుగ ప్రతిబింబించే పల్లె వాతావరణ అంశాలపై వేసిన రంగవల్లులు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పీహెచ్‌సీ సిబ్బంది విజయ్, వసంతమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎంపీ తలారి రంగయ్య
- హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



కుందుర్పి హైస్కూల్లో పోటీలను పరిశీలిస్తున్న సమన్వయకర్త తలారి రంగయ్య



రాయదుర్గంలో పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

కుందుర్పి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కుందుర్పి హైస్కూల్లో జరుగుతున్న కబడ్డీ తదితర క్రీడా పోటీలను ఎంపీ ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, పాఠశాల కమిటీ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, సర్పంచులు అతావుల్లా, ప్రభాకర్, గంగాధర, గోవిందమ్మ పీఈటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణం, రూరల్ పరిధిలో 150 జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. తొలిరోజు 40 మ్యాచ్‌లు, రెండోరోజు గురువారం 40 మ్యాచ్‌లు జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మ్యాచ్‌లు సజావుగా జరిగేలా సచివాలయ సిబ్బందికి, పీడీలకు ఆయన సూచనలందజేశారు.

ఉరవకొండ: స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఆమిద్యాల1, ఆమిద్యాల-2 జట్ల మధ్య సాగిన కబడ్డీ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. మ్యాచ్‌ను తిలకించడానికి ఆమిద్యాల, మోపిడి తదితర గ్రామాలతో పాటు ఉరవకొండ పట్టణం నుంచి భారీగా క్రీడాభిమానులు తరలివచ్చారు. అలాగే ఎంపీడీఓ అమృతరాజ్ స్థానిక ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పీడీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ఆడుదాం...ఆంధ్రాలో భాగంగా గురువారం స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో మానిరేవు జట్టుపై బోరంపల్లి జట్టు విజయం సాధించింది. బోరంపల్లి జట్టును పంచాయతీ కార్యదర్శి అనిల్, గ్రామస్తు అభినందించారు. గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని క్రీడా పోటీల కో ఆర్డినేటర్ చల్లా కిరణ్ చౌదరి తెలిపారు.

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద గురువారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. గొటుకూరు జట్టుపై జల్లిపల్లి జట్టు, కూడేరు-2 జట్టుపై కొర్రకోడు జట్టు విజయం సాధించాయి. అరవకూరు సర్పంచ్ రామాంజనేయులు, క్రీడాకారులు, ప్రేక్షకులకు భోజన వసతి కల్పించారు. శుక్రవారం మహిళలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బాడ్మింటన్ పోటీ ఉంటుందని ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజునాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు అక్కులప్ప, నరసింహులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం, 75 వీరాపురం గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, పీఈటీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, ఎంపీటీసీ తిమ్మారాజు, నాయకులు భీంరెడ్డి, డిష్ వెంకటేశులు, రాజశేఖర్, శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, శంకర్‌గౌడు, అధికారులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల స్థాయిలో కొనసాగుతున్న క్రికెట్ పోటీల్లో గంగవరం, దుద్దేకుంట, హనిమరెడ్డిపల్లి విజయం సాధించి తదుపరి పోటీలకు అర్హత సాధించాయి. వాలీబాల్ పోటీల్లో నరసాపురం జట్టు విజేతగా నిలిచింది. మండల స్థాయిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కోకో, కబడ్డీల్లో మొత్తం 41 మ్యాచ్‌లను నిర్వహించాల్సి ఉందని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు.

వజ్రకరూరు: స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం వాలీబాల్ పోటీలో వెంకటాంపల్లి సచివాలయ జట్టుపై గంజికుంట-2 సచివాలయ జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ సత్యనారాయణ తెలిపారు. అలాగే కబడ్డీ పోటీల్లో కొనకొండ్ల-1 సచివాలయ జట్టుపై వెంకటాంపల్లి సచివాలయ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో పీడీలు సత్యనారాయణ, కళా సుధాకర్, రాజేష్, లక్ష్మీప్రసాద్, వెంకటలక్ష్మి, శ్యామల, పీఈటీ లిజి, క్రీడాకారులు పాల్గొన్నారు.

అవ్వతాతలకు అండగా సీఎం జగన్



బొమ్మహాళ్ మండలం ఉంతకల్లులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్ము పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారని ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కన్న, ఎంపీటీసీ వనజాక్షి, నాయకులు సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే బెళుగుప్ప మండలంలోని బీసీ కాలనీలో గురువారం వలంటీర్ పాతన్న, గ్రామ కన్వీనర్ పూల ప్రసాద్, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఉప సర్పంచ్ పాతన్న తదితరులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.



బెళుగుప్పలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు, నాయకులు

విద్యుత్ సమస్య లేకుండా చూడండి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సూచించారు. గురువారం ఆయన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఈఈ శేషాద్రిశేఖర్, ఏడీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల్లోని విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన చోట ఎంపీ నిధులతో అదనంగా నిధులు తీసుకువచ్చి విద్యుత్ సమస్యను తీర్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన బోర్ల తవ్వకం చేపట్టడానికి వెంటనే చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో ఎలాంటి నీటి సమస్య ఉండకూడదని శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్‌కు ఎంపీ సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీలు, ఏఈలతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, గొల్ల సూరి, దొణస్వామి, నరేంద్ర రెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామని సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సూచించారు. స్థానిక పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి వ్యవసాయ క్షేత్రంలో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ముఖ్యంగా వార్డుల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యల లేకుండా చూడాలన్నారు. అనంతరం వార్డుల వారీగా నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అన్ని వార్డులలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్లు లక్ష్మన్న, కుర్రా రాము, పరమేశ్వరప్ప, అర్చన, అబ్రహాం, మహాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ, రూప తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: సామాన్యులకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం విలేకరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కణేకల్లు జెడ్పీటీసీ పద్మావతి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్‌పర్సన్ కోకుర్తి ఉషారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. గత టీడీపీ హయాంలో వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక సాధికారత చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేశాడన్నారు. సర్వేల్లో ప్రజల మన్ననలు పొంది, గెలవగల సత్తా కలిగిన వ్యక్తులకే సీఎం జగన్ పార్టీ పగ్గాలు అప్పగిస్తున్నారన్నారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా కొన్నిచోట్ల మార్పులు అనివార్యమని, దీన్ని అర్థం చేసుకోలేక విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. 2024లోనూ మళ్లీ సీఎంగా జగన్ మాత్రమే గెలవడం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే పేదల భవిష్యత్తుకు మార్గం లభిస్తుందన్నారు. పార్టీలో వ్యక్తులు మారడం సహజమేనన్నారు. అంతమాత్రాన క్యాడర్ మొత్తం మారుతుందనేది అవాస్తవమని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. అనంతరం అక్కడే పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, సర్పంచులు ఎన్.రమేష్, జీ రామాంజినేయులు, కో-ఆప్షన్ సభ్యుడు దిలవర్‌బాషా, నాయకులు తాళ్లకెర వీరభద్రారెడ్డి, పాటిల్ వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, ఐదు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి





రాయదుర్గం, ఉరవకొండలో వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్/ఉరవకొండ: వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర్య సమరవీరుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని వడ్డే కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి వినాయక సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న పోరాటస్ఫూర్తి భావితరాలకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు గోవింద, గురుస్వామి, గౌరవాధ్యక్షులు గోవిందప్ప, లక్ష్మణ, కన్వీనర్ జయన్న, కో కన్వీనర్ దుర్గన్న, కార్యదర్శి వేదమూర్తి, ప్రసాద్, ఉప కార్యదర్శి సుదర్శన్, నాగరాజు, వెంకరటరమణ, యూత్ కమిటీ అధ్యక్షుడు కేశవ్, కోశాధికారి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి వడ్డెర్ల సేవా సంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న చిత్రపటంతో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద వడ్డెర్ల సంఘం నాయకులు బూదగవి భీమేష్, గంగాధర్, లాలుస్వామి, వీరన్న, హంపయ్య, మోహన్, గంగరాజు, రామన్న, నాగరాజు, ధనంజయ మాట్లాడుతూ వడ్డె ఓబన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. వడ్డెర కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు గుర్తింపునిచ్చి, రాజకీయంగా ఎదిగేందుకు సహకరించాలన్నారు.

'ఏవీఆర్ స్కూల్‌ను సీజ్ చేయాలి'

రాయదుర్గంటౌన్: విద్యా సంవత్సరం పూర్తికాకముందే నిబంధనలను తుంగలోతొక్కి ముందస్తుగా అడ్మిషన్లకు పాల్పడుతున్న ఏవీఆర్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐవైఎఫ్ కార్యదర్శి కొట్రేష్ మాట్లాడుతూ ఏవీఆర్‌స్కూల్ యాజమాన్యం కొన్ని రోజులుగా పది మంది స్టాఫ్ బస్సులో తిరుగుతూ అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. గురువారం బస్సు టైరు గాలి తీసి ప్రచార కరపత్రాలను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. అధికారులు స్పందించి ఏవీఆర్ స్కూల్ అక్రమ అడ్మిషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయదుర్గంటౌన్/గుమ్మఘట్ట: రాయదుర్గం పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గురువారం పట్టణంలోని 15 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు తదితరులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ముందస్తుగా సౌకర్యాల కల్పనపై అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని కె.పి.దొడ్డి, గలగల, ఆర్.కొత్తపల్లిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బ్రహ్మయ్య గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్ర, సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఉరవకొండ/కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్: విజయవాడలో ఈనెల 19న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా తరలిరావాలని ఎంపీపీ వెలిగొండ నరసింహులు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకన్న కోరారు. బుధవారం ఉరవకొండ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నింబగల్లు హనుమప్ప, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్రిస్వామి, ఉమాశంకర్, వీరప్ప, పెద్ద ఉలిగన్న, లాలెప్ప పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు సచివాలయంలో గురువారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ గోపారం హేమావతి మాట్లాడుతూగా ఈనెల 19న విజయవాడలో జరిగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ శివ, సిబ్బంది బాలరాజు, పవన్‌లతో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా రాయదుర్గం పట్టణంలోని మేదరువీధిలోని 1, 11వ సచివాలయాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయిస్తుండడం గొప్ప నిర్ణయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారదాదేవి, మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, రామాంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులను విక్రయించేలా చూస్తాం

కణేకల్లు: మీ పంట ఉత్పత్తులను దళారులు తీసుకెళ్లాలా చూస్తాం... ఎవరూ అధైర్యపడొద్దని ఎస్ఐ శ్రీనివాసులు దళిత రైతులకు భరోసా కల్పించారు. మండలంలోని బెణికల్లులో గత నెలలో గజగౌరీ ఉత్సవాల సందర్భంగా అగ్రవర్ణాలు, దళితుల మధ్య వివాదం మొదలైన విషయం విదితమే. అప్పట్లో కళ్యాణదుర్గం డీఎస్పీ, రాయదుర్గం రూరల్ సీఐతోపాటు పోలీసులు దళితులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. అయితే ఎస్సీ, నాన్‌ఎస్సీల మధ్య వివాదం మళ్లీ మొదటికొచ్చింది. దళితులు పండించిన వరి ఉత్పత్తులను ఎవ్వరూ కొనుగోలు చేయొద్దని కొందరు దళారులను హెచ్చరించడంతో గత కొన్ని రోజుల నుంచి దళిత రైతుల వరిధాన్యం అమ్ముడుబోకుండా ఇళ్ల వద్దే ఉండిపోయింది. ఈ సమస్యను దళితులు గురువారం పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వివరించడంతో ఎస్ఐ స్పందించి బెణికల్లు గ్రామాన్ని సందర్శించారు. శుక్రవారం గ్రామానికొచ్చి దళారులు పంట ఉత్పత్తులు కొనేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

శెట్టూరు: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మంజునాథ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సాధార సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలు, పరిష్కారాలపై సభలో చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. బచ్చేహళ్లి, ములకలేడు, మాకోడికి, ఐదుకల్లు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పలుమార్లు సభ దృష్టికి వచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయకట్టు, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమావేశాల్లో తప్ప ప్రజలకు అందుబాటులో లేరని ప్రజాప్రతినిధులు వాపోయారు. ములకలేడులో అక్రమ లే అవుట్లను అరికట్టడంలో రెవెన్యూ, పంచాయితీ శాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు, తహసీల్దార్ ఫణికుమార్, మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, వైఎస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ పర్యటన

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య శుక్రవారం పట్టణంలో పర్యటించనున్నారు. ఈ మేరకు గురువారం ఎంపీ కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ కార్మికులు హాజరుకావాలన్నారు.

తక్షణసాయం అందజేత

కంబదూరు: కొత్తపల్లికి చెందిన కృష్ణమూర్తి(35) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. గురువారం మృతుని భార్య రాధకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును వైఎస్సార్‌సీపీ నాయకుడు సాకే తిమ్మప్ప అందజేశారు. మిగిలిన సొమ్మును నామినీ ఖాతాలోకి జమవుతుందన్నారు. నాయకులు లింగమూర్తి, కురుబ బసప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కార్మికులు

రాయదుర్గంటౌన్: ఎట్టకేలకు మున్సిపల్ కార్మికులు సమ్మెను విరమించి గురువారం నుంచి విధుల్లో చేరారు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చలు సానుకూలంగా జరగడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు.